క్లుప్తంగా

గురుకుల పాఠశాల స్థలం పరిశీలన



గురుకుల పాఠశాల స్థలాన్ని పరిశీలిస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు

అర్వపల్లి : కాసర్లపహాడ్ గ్రామంలో ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలకు కేటాయించిన 7ఎకరాల స్థలాన్ని జిల్లా పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. ఈ స్థలాన్ని ఎమ్మెల్యే సామేల్ పరిశీలించి విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడం హర్షణీయమని చెప్పారు. వెంటనే సొంత భవనాన్ని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య, దాసరి శ్రీను, జిల్లా అధ్యక్షుడు వీరస్వామి, సీహెచ్.లక్ష్మణ్, వి.రాము, వెంకట్, లింగయ్య, సాయిలు, తిరుపతయ్య, శోభన్, బన్ని, మల్లయ్య, నాగయ్య, అంతయ్య, యల్లమ్మ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో పిటిషన్

సూర్యాపేట : గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో తనపై అక్రమ కేసులు పెట్టిందని సూర్యాపేటకు చెందిన వట్టె జానయ్య యాదవ్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసును పరిశీలించిన జడ్జి.. ఒకే వ్యక్తిపై ఒకేసారి ఇన్ని కేసులు ఎలా పెట్టారు.. మీ దగ్గర ఉన్న ఆధారాలు ఏంటి అంటూ ప్రశ్నించారు. ఈ కేసుపై ఈ నెల 4వ తేదీన సుప్రీం కోర్టుకు తెలంగాణ డీజీపీ హాజరు కావాలంటూ జడ్జి మంగళవారం ఆదేశించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చివ్వెంల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్. సంతోష్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాయలంలో ఐటీసీ ఎంఎస్‌కే–గ్రీన్ కాస్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్రాస్ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ తండు నాగరాజు, ఏపీఓ నాగయ్య, ఎంపీఓ దయాకర్, వైద్యాధికారి విజయ సారథి, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమిస్తే చర్యలు



వక్ఫ్ బోర్డు భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ అసదుల్లాఖాన్, తదితరులు

నూతనకల్ : వక్ఫ్‌బోర్డు, పీర్ల కొట్టం భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అసదుల్లాఖాన్ అన్నారు. మంగళవారం చిల్పకుంట్లలో సర్వే నంబర్ 405, 463లో గల 10ఎకరాల 6గుంటల భూమిని సర్వే చేశారు. ఈ సందర్భంగా సంబంధిత రైతు అధికారులు చేస్తున్న సర్వేను అడ్డుకున్నారు. 75 సంవత్సరాల నుంచి భూమిపై సర్వాధికారాలు కలిగి ఉన్నామని, ప్రస్తుతం హైకోర్టులో స్టే కొనసాగుతున్నప్పటికీ అధికారులు సర్వే నిర్వహించడానికి ప్రయత్నించారని రైతు మల్లారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వేయర్ వెంకట్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు రెంటల్ కలెక్టర్ పఠాన్‌జానీ, అవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ



శ్రీనివాస్

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలి కాలనీకి చెందిన వంగరి శ్రీనివాస్ డీఎస్సీ ఫలితాల్లో 81.50 మార్కులు సాధించి 6వ ర్యాంకు పొందారు. శ్రీనివాస్ ఉపాధ్యాయ పోస్టుకు ఎంపిక కావడంతో స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన నీరు అందించాలి

నడిగూడెం : ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించాలని మండల ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ అన్నారు. నడిగూడెం, అనంతగిరి మండలాల తాగునీటి సహాయకులకు మిషన్ భగీరథ (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో నడిగూడెంలో నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

శునకాల గుంపు.. జనాల్లో వణుకు

- గ్రామాల్లో పెరుగుతున్న కుక్క కాటు కేసులు
- బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న ప్రజలు



ఆత్మకూరులో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు



తిరుమలగిరిలో..

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా ఊర కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండల పరిధిలోని ఏ గ్రామంలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. పశువులు, కోళ్లు, మనుషులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఊర కుక్కల బెడద నివారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కుక్కల కారణంగా ఒంటరిగా వీధుల్లో తిరిగే పరిస్థితి లేకుండాపోయింది. వీధి కుక్కల నిర్మూలనకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వీటి సంతానం ప్రతి ఏటా పెరుగుతోంది. ఇటీవల బొప్పారం గ్రామంలో గ్రామ పంచాయతీ వర్కర్ ఎర్ర మల్లయ్యపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అలాగే చెక్కల మౌనిక అనే బాలికపైన దాడి చేశాయి. అన్ని గ్రామాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి.

భయం, భయంగా..

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో, మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి కాలు బయట పెట్టాలంటే జంకుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా కాలనీల్లో కుక్కల సంఖ్య పెరుగుతోంది. గ్రామాల్లో కుక్క కాటు బాధితుల సంఖ్య కూడా పెరుగుతోంది. చిన్న పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లాలంటే ఎక్కడి నుంచి కుక్కలు వచ్చి దాడులు చేస్తాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో సంబంధిత అధి కారులు కుక్కల బెడదను నియంత్రించి ప్రజల ఇబ్బ ందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రెండు రోజుల వ్యవధిలో పది మందిపై దాడి

అర్వపల్లి : కోతులు, కుక్కలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అర్వపల్లితోపాటు జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా సోమ, మంగళ వారాల్లో రెండురోజుల వ్యవధిలో కోతులు, కుక్కలు 10 మందిని కరిచి గాయపరిచాయి. అర్వపల్లికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు డాక్టర్ జిల్లా కిరణ్‌కుమార్‌ను కుక్క కరిచి గాయపరిచింది. సమీపంలో ఉన్నవారు వచ్చి కుక్కను వెళ్లగొట్టారు. అలాగే ఉయ్యాలవాడ, బొల్లంపల్లి, కొమ్మాల, తిమ్మాపురం తదితర గ్రామాలకు చెందిన పలువురిని కుక్కలు, కోతులు కరిచి గాయపరిచాయి. వీటిని వెంటనే అధికారులు నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కలు వెంట పడుతున్నాయి

వీధి కుక్కల వల్ల ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నాం. గ్రామాల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. వాహనాల మీద వెళ్తుంటే కొన్నిసార్లు మీది మీదికి వస్తున్నాయి. కుక్కల బెడదపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

– శ్రీనివాస్, తిరుమలగిరి

వీధి కుక్కలను నివారించాలి

గ్రామంలో వీధి కుక్కలు అధికంగా ఉన్నాయి. ప్రధాన రహదారులతోపాటు ఏ సందులోకి ఒంటరిగా వెళ్లే పరిస్థితి లేదు. కుక్కలు వృద్ధులు, చిన్నారుల వెంటపడి మరీ దాడి చేస్తున్నాయి. అధికారులు స్పందించి వీధి కుక్కలను నివారించాలి.

– ఎర్ర మల్లయ్య, బొప్పారం

పండుగ సందడి



ఎంగిలిపువ్వు బతుకమ్మ కోసం సూర్యాపేటలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



సూర్యాపేటలోని సద్దుల చెరువుకట్టపై ఏర్పాటు చేసిన లైటింగ్స్



స్కూళ్లకు సెలవులు రావడంతో పండుగకు ఇళ్లకు వెళ్లేందుకు సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో మంగళవారం బస్సుల కోసం ఎదురుచూస్తున్న జనం

ప్రభుత్వాలు హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం చీదెళ్ల గ్రామంలో సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల పక్షాన నిరంతరం పోరాడేది ఎర్రజెండా పార్టీ మాత్రమేనని అన్నారు. ప్రపంచం మొత్తం ఎర్రజెండా వైపు చూస్తోందని, శ్రీలంకలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య కుల, మత భేదాలు సృష్టించి అధికారం నిలబెట్టుకోవాలని కుట్ర చేస్తోందన్నారు. జమిలి ఎన్నికలు తీసుకువచ్చి ఫెడరల్ వ్యవస్థకు భంగం కలిగించాలని ప్రయత్నిస్తోందని తెలిపారు. చీదెళ్ల నుంచి మాదారం వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. అనంతరం సీపీఎం గ్రామశాఖ నూతన కార్యదర్శిగా కొండమీది రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మడ్డి అంజిబాబు, గుర్రం గోపాల్‌రెడ్డి, మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, చినపంగి నర్సయ్య, బొమ్మిరెడ్డి గోపిరెడ్డి, వెన్న వెంకటరెడ్డి, చినపంగి లచ్చయ్య, నలబోలు వెంకటరెడ్డి, గోపయ్య, వెంకన్న, రాములు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణతో మహిళలకు ఉపాధి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్

సూర్యాపేట : కుట్టు మిషన్ శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని అన్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో ఉచిత కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. మొత్తం 120మంది మహిళలు శిక్షణ పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్‌పర్సన్ గండూరి కృపాకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి చార్టర్ ప్రెసిడెంట్ ఇరిగి కోటేశ్వరి, పాస్ట్ ప్రెసిడెంట్ బీరవోలు హైమావతి, లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి సెక్రటరీ సుమలత, ట్రెజరర్ డాకా విజయలక్ష్మి, మందడి రమాదేవి, కేతిరెడ్డి పద్మ, కొప్పు సందీప్, కళ్యాణ్, ఎండీ ఇస్మాయిల్, అనిల్, కుట్టు మిషన్ శిక్షకురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా చిలక రమేష్

చివ్వెంల : టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా గుడితండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న చిలక రమేష్ ఎన్నికయ్యారు. మంగళవారం సూర్యాపేటలో నిర్వహించిన జిల్లా 5వ మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఎం.రాజశేఖర్ రెడ్డి, జి. నాగమణి, సీహెచ్, రాము వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బోడే దయాకర్, సైమన్, శంకర్, అనిల్ కుమార్, జమాలుద్దీన్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన అవసరం

అర్వపల్లి : మూసీ ప్రక్షాళన ఎంతో అవసరమని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు నిద్ర సంపత్ నాయుడు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మూసీ ప్రక్షాళన జరగకపోతే హైదరాబాద్ నగరంతోపాటు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలు నీట మునిగి ప్రజలు తీవ్రంగా నష్టపోనున్నారని చెప్పారు. మూసీ ప్రక్షాళనపై బీఆర్‌ఎస్ నాయకులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధి కోమటిరెడ్డి బ్రదర్స్ వల్లనే సాధ్యమైందని పేర్కొన్నారు.

దుండగులను శిక్షించాలి

తుంగతుర్తి : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసులు తక్షణమే విచారణ చేపట్టి నేరస్తులను అరెస్ట్ చేయాలని అన్నారు. ఇలాంటి అరాచకాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

ఆత్మరక్షణకు కరాటే ఒక ఆయుధం



విద్యార్థులను సన్మానిస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీలత, సీఐ శ్రీను నాయక్

తుంగతుర్తి : ఆత్మరక్షణకు కరాటే ఒక ఆయుధమని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీలత అన్నారు. 22వ జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సన్మానించి మాట్లాడారు. ఇటీవల మిర్యాలగూడలో జరిగిన జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్ సాధించిన దీక్షిత్ నాయక్, మని చందు, లిఖిత్ కుమార్‌లను, కరాటే మాస్టర్‌ను సన్మానించారు. వారికి మెడల్, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ ఏడుకొండలు, కరాటే మాస్టర్ అరుణ, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు



బాలునాయక్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

నాగారం : విధి నిర్వహణలో కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంఈఓ బి.బాలునాయక్‌ను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మంగళవారం నూతన ఎంఈఓ వాసం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం విష్ణుమూర్తి, కేజీబీవీ ఎస్ఓ శిరీన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు చక్రధర్, బింగి శ్రీను, కృష్ణయ్య, వి.మల్లయ్య, గుండెటి లక్ష్మణ్, వీరేష్, శ్రీనివాస్, ఉమామహేశ్వరి, కమల, భాస్కర్, కేఎల్ఎన్ రావు, సీఆర్పీలు స్వామిగౌడ్, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, సునీత తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవులకు అండగా సీపీఎం

నాగారం : కష్టజీవులకు అండగా సీపీఎం ఉంటుందని ఆ పార్టీ మండల కార్యదర్శి కడియం కుమార్ అన్నారు. మంగళవారం నాగారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ కార్మికులు, రైతుల హక్కుల కోసం సీపీఎం నిరంతరం ఉద్యమాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యాకలక్ష్మి, పులుసు సత్యం, గుడపూడి వెంకటేశ్వర్లు, దేవరకొండ వెంకన్న, నిర్మల మారయ్య, తంగెళ్లపల్లి వెంకన్న, దేవరకొండ యాదగిరి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల ఆర్థిక చేయూత



పెన్‌పహాడ్ : విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఫర్నిచర్ అందజేస్తున్న దాత

పెన్‌పహాడ్ : దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం శంభులింగం అన్నారు. చీదెళ్ల గ్రామానికి చెందిన పరెడ్డి గోపిరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు వెంకటరాంరెడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్, ఫర్నిచర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతనకల్ : నిరుద్యోగ యువతి ఉద్యోగ సాధన కోసం ఎన్ఆర్ఐ తూమాటి భీష్మారమమణి ఆర్థిక సహకారం అందించినట్లు మండల విద్యాధికారి రాములు నాయక్ తెలిపారు. బిక్కుమళ్ల గ్రామానికి చెందిన కొమ్ము పూజిత మండలంలోని పెద్ద నెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి హైదరాబాద్‌లోని సైనిక్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. కానీ ఉద్యోగ సాధనకు కోచింగ్ సెంటర్లకు వెళ్లి ప్రిపేర్ అవడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటుంది. పూజిత పరిస్థితిని తెలుసుకున్న ఎన్ఆర్ఐ తన తల్లి కత్తురోజు పద్మమ్మ జ్ఞాపకార్థం ఎస్ఐ కోచింగ్ తీసుకోవడం కోసం రూ. 50వేల నగదును పూజితకు అందించింది. ఆర్థిక సహకారం అందించిన ఎన్ఆర్ఐని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ధరావత్ శివయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అరుణ, ఉపాధ్యాయులు చవగాని వెంకటయ్యగౌడ్, హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

తుంగతుర్తి : వెలుగుపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయురాలు కర్పూరం నివేదిత తన తండ్రి కర్పూరం నిరంజన్ జ్ఞాపకార్థం మంగళవారం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 70 మంది విద్యార్థులకు సుమారుగా రూ.25 వేలతో దుస్తులను కొనుగోలు చేసి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు అబ్బయ్య, ఎలిజావత్, షరీఫ్, కల్పన, నాగయ్య, షాహిద్ బేగం, యాదయ్య, అవిలేను పాల్గొన్నారు.



నూతనకల్ : విద్యార్థికి చెక్కు అందజేస్తున్న మండల విద్యాధికారి రాములు నాయక్



తుంగతుర్తి : వెలుగుపల్లి పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న నివేదిత

పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలు



సూర్యాపేటటౌన్ : జీఆర్ వివేకావాణి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



తుంగతుర్తిలోని విద్యా భారతి పాఠశాలలో..



తిరుమలగిరి : కృష్ణవేణి పాఠశాలలో..



నాగారం ప్రాథమిక పాఠశాలలో..



మద్దిరాల : చందుపట్ల పాఠశాలలో..



ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్ పాఠశాలలో..



సూర్యాపేట : చందన నర్సింగ్ కళాశాలలో..



తిరుమలగిరి: తొండ గ్రామంలోని పాఠశాలలో..



ఆత్మకూర్ (ఎస్) : మోడల్ స్కూల్‌లో..



అర్వపల్లి : రామన్నగూడెం పాఠశాలలో..



నాగారం : విజయనగర్ కాలనీ పాఠశాలలో..



అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలలో..



నూతనకల్ : నాగార్జున ఉన్నత పాఠశాలలో వివిధ వేషధారణలో విద్యార్థులు

న్యూడెమోక్రసీలో చేరిక

తిరుమలగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మండల కేంద్రంలో పలువురు నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకులు ఇందురి సాగర్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, రాయిల రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డెమ్మ పండుగ



సూర్యాపేటలోని 31వ వార్డు బాలాజీ నగర్‌లో బొడ్డెమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు